సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



సమగ్ర యాజమాన్యంతో మేలు
జీడిమామిడిలో యాజమాన్యంతోనే ఉత్పాదకత మెరుగుపడుతుందని కేవీకే కోఆర్డినేటర్ లలితా కామేశ్వరి సూచించారు. 8లో



భిన్న వాతావరణం
మన్యంలో గురువారం ఉదయం పొగమంచు దట్టంగా కురిసింది. మధ్యాహ్నం భానుడు ప్రతాపం చూపడంతో జనం అల్లాడిపోయారు. 8లో



రోగులకు సకాలంలో వైద్యం
ఆస్పత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అడ్డతీగల: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం అడ్డతీగల, రంపచోడవరం, గంగవరం, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీ ట్రాన్స్‌కో ఈఈ యూసఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

అనంతగిరి: మండలంలో శుక్రవారం ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు పర్యటిస్తున్నట్టు ఎస్టీకమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మీ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ బొర్రాగుహల వద్ద నిబంధనలు విరుద్ధంగా జిప్ లైన్ ఏర్పాటు చేశారని ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు స్థానికులు, ఏపీ టూరిజం కార్మికులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఆయన పర్యటిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా బొర్రా సచివాలయం వద్ద గిరిజనులతో సమావేశమవుతారన్నారు. అనంతరం టోకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శిస్తారని ఆమె వెల్లడించారు.

21,448 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో ఈ ఏడాది రైతులు పండించిన ధాన్యాన్ని 45 కొనుగోలు కేంద్రాలద్వారా 21,448 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఈ మేరకు పీవో తన చాంబర్‌లో గురువారం మాట్లాడుతూ రంపచోడవరం ఏజెన్సీ 11 మండలాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించారని తెలిపారు. రైతులు 4443 మంది నుంచి రూ. 46.82 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశామన్నారు. వీటికి సంబంధించి ఇప్పటివరకు రూ. 25.51 కోట్లు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. మరో రూ. 21.31 కోట్లు చెల్లించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

32 వేల మందికి నులి పురుగుల మాత్రలు

- చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చింతూరు డివిజన్లో 32 వేలమంది చిన్నారులకు నులి పురుగు మాత్రలు అందేలా చర్యలు చేపట్టినట్లు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య గురువారం తెలిపారు. శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో డివిజన్లోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండాజోల్ మాత్రలు అందేలా వైద్యసిబ్బంది, ఎంపీడీవో, ఎంఈవో, సీడీపీవో, ఏపీఎం, ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల పయనం

- ప్రత్యేక బస్సులో తరలివెళ్లిన క్రీడాకారులు



ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీలకు వెళుతున్న జిల్లా క్రీడాకారులు

సాక్షి,పాడేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన జిల్లాలోని పలు జట్లు గురువారం విశాఖకు ఉత్సాహంగా తరలివెళ్లాయి. వీరంతా ప్రత్యేక బస్సులో విశాఖ వెళ్లారు. ఈనెల 9వతేదీ నుంచి 13వతేదీ వరకు విశాఖపట్నంలో ఈపోటీలు జరుగుతాయి. అన్ని క్రీడల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి విజేతలుగా నిలవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ భావన, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎ.జగన్మోహనరావు ఆకాంక్షించి, అభినందించారు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి : తేనెటీగలు దాడి చేయడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఉప్పరుగోతులు గ్రామానికి చెందిన పి. లక్ష్మణ్‌ను గ్రామ సమీపంలోని కొండపోడు వద్ద వ్యవసాయ పనులు చేస్తుండగా తేనెటీగలు అతనిపై దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన అతనిని కుటుంబసభ్యులు రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

77.33 కిలోమీటర్లు.. రూ.30.41 కోట్లు

- ప్రధాన రోడ్లను అభివృద్ధి చేసిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- వందల సంఖ్యలో గ్రామాలకు మెరుగుపడిన రవాణా సౌకర్యం
- అవస్థలు తప్పడంతో గిరిజనుల్లో ఆనందం



అభివృద్ధి చేసిన పాడేరు ఘాట్ రోడ్డు

సాక్షి,పాడేరు: జిల్లాలోని ఘాట్, ఆర్‌అండ్‌బీ రోడ్లు మెరిసిపోతున్నాయి. ఇందుకు గాను ప్రభుత్వం ప్రత్యేక నిధులు వెచ్చించింది. గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పాలనలో ఆర్‌అండ్‌బీ రోడ్లను పట్టించుకోలేదు. అధ్వాన రోడ్లతో ప్రయాణానికి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. గుంతలతో అధ్వానంగా మారిన రోడ్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించింది. సుమారు 77.33 కిలోమీటర్ల మేర వివిధ రోడ్లను రూ.30.41 కోట్లతో అభివృద్ధి చేసింది.

- మారేడుమిల్లి నుంచి భద్రాచలం వెళేఏల ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా,ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వందలాది వాహనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. అధ్వానంగా మారిన పలుచోట్ల ఈరోడ్డు అభివృద్ధికి రూ.7.42 కోట్లను ఆర్‌అండ్‌బీశాఖ వెచ్చించింది. దీంతో నాలుగు రాష్ట్రాల ప్రజలకు రవాణాకు సౌకర్యవంతంగా అభివృద్ధి చేసింది.
- అధ్వానంగా మారిన జి.మాడుగుల నుంచి చింతపల్లి వెళ్లే రోడ్డు గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 14.8 కిలోమీటర్ల రోడ్డును రూ.4.25 కోట్లతో నిర్మించింది. ఇదే మార్గంలో అన్నవరం నుంచి చెరుకుంపాకలు వరకు 8కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.58 కోట్లు, చెరుకుంపాకలు నుంచి లోతుగెడ్డ రోడ్డులో కిన్నెర్ల వరకు 7.8కి లోమీటర్ల రోడ్డును రూ.2.75 కోట్లతో అభివృద్ధి చేసింది. దీంతో పాడేరు,జి.మాడుగుల, చింతపల్లి,గూడెంకొత్తవీధి మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది.
- జి.కే.వీధి మండలం ధారకొండ –సీలేరు రోడ్డులో అధ్వానంగా మారిన 4.4కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.88 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసింది.
- నర్సీపట్నం నుంచి కొయ్యూరు, చింతపల్లి నుంచి గూడెంకొత్తవీధి రోడ్డును అభివృద్ధి చేశారు. కొయ్యూరు మండలం డౌనూరు ప్యాకేజీలో 6.85 కిలోమీటర్ల రోడ్డును రూ.2.66 కోట్లు, చింతపల్లి–జి.కే.వీధి రోడ్డులో 6.4 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.85 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశారు. దీంతో నాలుగు మండలాల ప్రజలకు రవాణా పరమైన అవస్థలు తప్పాయి.
- పాడేరు– ముంచంగిపుట్టు మార్గంలో 7.8 కిలోమీటర్ల రోడ్డును రూ.2.66కోట్లతో ఆర్‌అండ్‌బీ అధికారులు అభివృద్ధి చేశారు.

రెండేళ్లలో ఎంతో అభివృద్ధి



జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్ అండ్‌బీ రోడ్లను గత రెండేళ్లలో అభివృద్ధి చేశాం. దీంతో ప్రధాన ఘాట్‌రోడ్లలో ప్రయాణం సురక్షింతంగా సాగుతోంది. ప్రమాదాలు కూడా తగ్గాయి.జాతీయ రహదారిలో విలీనమైన రోడ్లు మినహా మిగిలిన రోడ్లను నిత్యం పర్యవేక్షిస్తూ తగు చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నాం.

– బాలసుందరబాబు, ఈఈ, ఆర్‌అండ్‌బీ, పాడేరు

నిరుద్యోగ యువతులకు ఉద్యోగాలు

- పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు
- ఎస్పీ తుహిన్ సిన్హా
- ప్రేరణలో 250 మంది ఎంపిక



మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా



హాజరైన గిరిజన నిరుద్యోగ యువతులు

పాడేరు : జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగ గిరిజన యువతులకు ఉద్యోగాల కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. గురువారం స్థానిక ఆర్ఆర్ కళ్యాణ మండపంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి పాడేరు ఐటీడీఏ పరిధిలోని పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకువేలి, అనంతగిరి మండలాల నుంచి 320 మంది యువతులు హాజరు కాగా వీరిలో 250 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్ణయించామన్నారు. టాటా కంపెనీ, ప్రశాంతి ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌తో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఎంపిక ప్రక్రియను నిరుద్యోగ గిరిజన యువతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎంపికైన వారికి తమిళనాడు హోసూర్‌లో 11 నెలల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ కాలంలో నెలకు రూ.18వేల వేతనంతో పాటు రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే పీఎఫ్, మెడికల్ సౌకర్యం, ఇతర అలవెన్సులు ఇస్తారని తెలిపారు. ఈనెల 6న చింతపల్లిలో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో 330 మంది ఎంపికయ్యారన్నారు. ఈనెల 10న రంపచోడవరం, 12 ఎటపాక మండలాల్లో ప్రేరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు. పాడేరు ఏఎస్పీ ధీరజ్, జి.మాడుగుల సీఐ రమేష్, ఎస్ఐలు రంజిత్, లక్ష్మణరావు, మనోజ్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

పీఎం పాలెం (విశాఖ): ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విద్యార్థిని తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అందించిన వివరాల ప్రకారం.. పాడేరు సమీపంలోని కిండంగికి చెందిన యు.కోటేశ్వరరావు గ్రామంలో కిరాణా దుకాణం నడుపుతున్నాడు. అతని కుమార్తె (16) మారికవలసలోని ఓ ప్రైవేట్ కళాశాల వసతి గృహంలో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతోంది. తోటి విద్యార్థినులు వేధింపులకు గురిచేయడంతో గురువారం తెల్లవారుజామున తాను పడుకున్న మంచం పై నుంచి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. పెద్ద శబ్దం రావడంతో తోటి విద్యార్థినులు లేచి ఉరి బిగియకముందే చున్నీని తప్పించి కాపాడారు. కళాశాల నిర్వాహకులు వెంటనే స్పందించి మధురవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తోటి విద్యార్థినులు సకాలంలో స్పందించడం వల్ల తమ కుమార్తెకు ప్రాణాపాయం తప్పిందని తండ్రి కోటేశ్వరరావు తెలిపారు.

రాజ్యసభలోనూ ఉత్తరాంధ్రకే పెద్దపీట

వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావుకు అవకాశం





సాక్షి విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఉత్తరాంధ్ర పక్షపాతి అని నిరూపించారు. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైతే అందులో రెండు ఉత్తరాంధ్రకే అవకాశం కల్పించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించారు. దీనిపై ఉత్తరాంధ్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైవీ సుబ్బారెడ్డి..

వైవీ సుబ్బారెడ్డిది ప్రకాశం జిల్లా మేదరమెట్ల. తల్లిదండ్రులు ఎర్రం చిన్నపోలిరెడ్డి, పిచ్చమ్మ. షోలాపూర్‌లో భారతీ విద్యాపీఠ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ(మార్కెటింగ్ అండ్ ఫైనాన్స్) పూర్తి చేసారు. 2014 సాధారణ ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి 16వ లోక్‌సభలో అడుగుపెట్టారు. పరిశ్రమల స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా, ప్రైవేట్ బిల్లుల, తీర్మానాల కమిటీలో సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకాల(ఎంపీ ల్యాడ్స్) కమిటీ, ఆర్థిక కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో కాన్సులేటివ్ కమిటీలో సభ్యుడిగా పనిచేశారు. ప్రత్యేక హోదా కోసం 2018లో లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2019 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీలోనూ పలు పదవులు నిర్వర్తించారు. గతంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు.

విశ్వసనీయతకు గుర్తింపు

విధేయత, విశ్వసనీయతకు గుర్తింపుగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు. గ్రూప్–1 అధికారిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన బాబూరావు మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేశారు. అక్కడ ముప్పై ఏళ్ల టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టి తొలిసారిగా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురువేశారు. కొద్ది నెలలకే వైఎస్సార్ దుర్మరణం పాలవ్వడంతో తదనంతర పరిణామాల్లో జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీని స్థాపించారు. జిల్లాలో బాబూరావు ఒక్కరే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి జగన్ వెంట నడిచారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కూడా పనిచేశారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున అమలాపురం ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో తిరిగి పాయకరావుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

సుపరిపాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరికలు

- ఆ పార్టీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- టీడీపీకి చెందిన ఇద్దరు వార్డు సభ్యులు, జనసేత నేతలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానం



భీరంలో టీడీపీకు చెందిన వార్డు సభ్యుడు, జనసేన నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులపై టీడీపీ, జనసేన తదితర పార్టీల నాయకులు అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాసు పేర్కొన్నారు. మండలంలో భీరం పంచాయతీ తాడివీధి గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన వార్డు సభ్యుడు సోమెలి ఈశ్వరరావు, 9వ వార్డు సభ్యుడు కిల్లుడు మత్స్యలింగం , మాజీ వార్డు సభ్యులు సీదరి అప్పలరాజు, రామారావులతో పాటు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 40కుటుంబాలు ఆయన ఆధ్వర్యంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి విశ్వేశ్వరరాజు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు విధానాలు నచ్చక తమ పార్టీలో చేరుతున్నారన్నారు. కుల మత, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పాలనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారన్నారు.

మున్ముందు టీడీపీకి జెండా పట్టుకునేవారే కరువవుతారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి మంచి భవిష్యత్తు కోసం మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని ఆయన కోరారు. వైఎస్ ఎంపీపీ కె సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండంనాయుడు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, గంగరాజు, మత్స్యం నాయుడు, రాంబాబు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సేఫ్టీ ఆడిట్, డబ్లింగ్ పనుల పరిశీలన



రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్

అనంతగిరి: కొత్తవలస-కిరండూల్ రైల్వేలైన్‌లోని గురువారం రైల్వే డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ సేఫ్టీ ఆడిట్, డబ్లింగ్ పనులను పరిశీలించారు. ముందుగా దర్లిపుట్‌లోని సేఫ్టీ అడిట్ నిర్వహించి, మరిన్ని సౌకర్యాలతో స్టేషన్ అభివృద్ధి చేసేందుకు పనులపై సమీక్షించారు. దర్లిపుట్ సమీపంలోని బండరాయి పడిపోయే ప్రమాదం ఉండడంతో విండో ట్రెలింగ్ తనిఖీలు చేపట్టారు. దర్లిపుట్ గోరపూర్ సెక్షన్ మధ్యలోని జరుగుతున్న డబ్లింగ్, ట్రాక్ పనులను పరిశీలించారు. ఓవర్‌హెడ్ పనులు, సిగ్నలింగ్ పనులను మరింత వేగవంతం చేయాలని డీఆర్‌ఎం సూచించారు. అరకులో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఫుట్ ఓవర్ వంతెన, భవనం మాస్టర్ ప్లాన్‌లోని చేర్పులు, మార్పులపై ఆయన సూచనలు చేశారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి పాల్గొన్నారు.

చింతపండు కిలో రూ.32.40

- ధర నిర్ణయించిన గిరిజన సహకార సంస్థ
- ఈ ఏడాది కొనుగోలుకు ఏర్పాట్లు



విరగ్గాసిన చింతకాయలు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో చింతపండు దిగుబడి ఆశాజనకంగా ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున గిరి రైతులు చింతపండు సేకరణలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వంట్లమామిడిలో అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది కూడా గిరి రైతుల నుంచి చింతపండు కొనుగోలుకు గిరిజన సహకార సంస్థ ఏర్పాట్లు చేసింది. గతేడాది మాదిరిగా కిలో రూ.32.40కు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ ధరతో గతేడాది చింతపల్లి, పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో 607.01మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. ఈ ఏడాది కూడా అదేస్థాయిలో కొనుగోలు చేస్తామని జీసీసీ యాజమాన్యం పేర్కొంది. పాడేరు మండలం వంట్లమామిడి, దేవాపురం, సలుగు, ఐనాడ పంచాయతీలకు చెందిన గిరిజనులు సేకరించిన చింతపండును వి.మాడుగుల, వంట్లమామిడి సంతల్లో విక్రయిస్తున్నారు. జీసీసీకి విక్రయించి మంచి ధర పొందాలని జీసీసీ పాడేరు డీఎం డి.సింహాచలం కోరారు.

కాసులు కురిపిస్తున్న కాశీపట్నం వంగ





కాశీపట్నం వారపు సంతకు గిరిజన రైతులు తీసుకువచ్చిన వంకాయలు

- సేంద్రియ విధానంలో సాగు
- పెద్ద సైజుతోపాటు రుచికరంగా ఉండటంతో డిమాండ్
- పోటీపడి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం

అనంతగిరి: మండలంలో పండించే దేశవాళీ రకం వంగకు ప్రత్యేకత ఉంది. పెద్ద సైజుతోపాటు రుచికరంగా ఉంటుంది. అందువల్ల వ్యాపారులు పోటపడి కొనుగోలు చేస్తున్నారు. రైతులంతా కాశీపట్నంలో బుధవారం జరిగే వారపు సంతకు తీసుకువచ్చి విక్రయించడం వల్ల 'కాశీపట్నం వంగ'గా ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం సీజన్ చివరి దశకు చేరుకోవడంతో తట్టలు, బుట్టలతో భారీగా తీసుకువస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంకు చెందిన వ్యాపారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ వారం తట్ట రూ.300 నుంచి రూ.500 వరకు ధర పలికింది. వంగ సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమై ఫిబ్రవరి మొదటి వారంతో ముగుస్తుంది.అకాల వర్షాలు వంగ సాగుకు కలిసి వచ్చిందని గిరిజన రైతులు తెలిపారు.

సేంద్రియ విధానంలో సాగు

మండలంలోని కాశీపట్నం, ఎన్ఆర్‌పురం, భీంపోల్, గుమ్మకోట, చిలకలగెడ్డ, గరుగుబిల్లి పంచాయతీల్లో సారవానిపాలెం, సీతంపేట, నందకోట, మండపర్తి, పల్లంవలస, గొట్టిపాడు, జీలుగులపాడు, బిల్లకోట, గుజ్జెలి తదితర గ్రామాల్లో గిరిజనులు వంగను సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సేంద్రియ విధానంలో పండించడం వల్ల మంచి డిమాండ్ ఉంది. ఇసుకతో కూడిన ఎర్ర నేలలో బాగా దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. సాధారణ రకంతో పోలిస్తే ఇక్కడ సాగుచేసే వంగమొక్కలు గుబురుగా పెరుగుతాయి. ఒక్కో వంకాయ సైజు సుమారు 200 గ్రాములకు పైబడి ఉంటుంది. సాధారణ వంగకు నీరు అధికంగా ఉండాలి. కానీ ఇక్కడ వంగకు నీరు అవసరం లేదు. పంటకాలం మూడు నెలల ఉంటుంది. విత్తనాలు సొంతంగానే రైతులు తయారు చేసుకుంటారు. 45 రోజులు గడిచిన తరువాత కాపు ప్రారంభమవుతుంది. ఎకరాకు ఖర్చులు పోను రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు పేర్కొన్నారు. ఇక్కడ పండించే వంగకు ముళ్లు ఉంటాయి. కూర జావ కాకుండా ముక్క మాదిరిగా ఉంటుంది.

అకాల వర్షాలతో మేలు



అకాల వర్షాలతో మేలు జరిగింది. జనవరితో ముగియాల్సిన వంగ సీజన్ కొనసాగుతోంది. ఇప్పటికీ దిగుబడి వస్తోంది. కేవలం అకాల వర్షాల వల్లే ఈ ఏడాది దిగుబడి పెరిగింది. రైతులకు మంచి ఆదాయం వచ్చింది. ఈ వారం తట్ట రూ.450కు విక్రయించా.

– మజ్జి అన్నపూర్ణ, మండపర్తి, అనంతగిరి మండలం

క్లుప్తంగా

బూరుగువాడలో గ్రామసభ



మాట్లాడుతున్న రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రియన్

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం సచివాలయంలో పరిధిలోని బూరుగువాడ గ్రామంలో డీఎఫ్‌వో నరేంద్రియన్ గురువారం గ్రామసభ నిర్వహించారు. విశాఖ జిల్లాలో రైలు పట్టాలలో నిర్వాసితులకు గ్రామంలోని గాలికొండ వద్ద భూములు కల్పించే విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై గ్రామస్తులు మాట్లాడుతూ కొండపై పశువులను మేపుకుంటున్నామని, భూములిస్తే ఇబ్బంది పడతామని, స్థలాలు ఇవ్వొద్దని వ్యతిరేకించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు చెప్పారు.సర్పంచ్ ఆర్.నరసింహమూర్తి సబ్ డిఎఫ్ఓ శ్రీరామారావు, రేంజ్ అధికారి సయ్యద్ సహెన్‌షా, డిప్యూటీ రేంజ్ అధికారి సత్యనారాయణ, అటవీశాఖ సిబ్బంది, తహసీల్దార్ ఎస్.నాగరాజు తదితరులున్నారు.

సమగ్ర యాజమాన్యంతో మేలు

రంపచోడవరం: ఏజెన్సీలో జీడిమామిడి సాగు ఎక్కువగా ఉన్నప్పటికీ ఉత్పాదకత తక్కువగా ఉందని, సరియైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడమే ఇందుకు కారణమని పందిరిమామిడి కేవీకే కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డా.పి.లలితా కామేశ్వరి సూచించారు. గురువారం జీడిమామిడి సుస్థిరసాగు, ప్రాసెసింగ్ అంశంపై అవగాహన సదస్సును డైరెక్టర్ ఆఫ్ క్యాషియో, కొబ్బరి అభివృద్ధి సంస్థ కొచ్చి సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీడిమామిడిలో కొమ్మ కత్తిరింపులు, టీ–దోమ యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు.ఉద్యాన శాస్త్రవేత్త డా. టి క్రాంతికుమార్ మాట్లాడుతూ అంటు మొక్కలను ఎంపిక చేసుకోవాలన్నారు. అంతర కృషి, కలుపు నీటియాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీడీ శ్రీనివాస్, హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్త డా. కె రాజేంద్రప్రసాద్, డా. వీరాంజనేయులు, ప్రవీణ్, ఏపీసీఎన్ఎఫ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహా క్రీడా సంబరం

విశాఖ సిద్ధం

- నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా తుది పోటీలు
- ఐదు క్రీడాంశాల్లో తలపడనున్న 26 జిల్లాల జట్లు
- సీఎం జగన్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం



ప్రారంభ వేడుకకు సిద్ధమైన రైల్వే స్టేడియం

విశాఖ స్పోర్ట్స్: మహా క్రీడా సంబరానికి విశాఖ సర్వం సిద్ధమైంది. గ్రామీణస్థాయి నుంచి యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రారంభించిన మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా' తుది ఘట్టానికి చేరుకుంది. నాలుగు దశల్లో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలకు విశేష స్పందన రాగా.. జిల్లా స్థాయిలో సత్తా చాటిన జట్లతో రాష్ట్ర స్థాయి పోటీలకు మరికొన్ని గంటల్లో తెరలేవనుంది. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు మహా సంగ్రామం జరగనుంది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు, ప్రో కబడ్డీ జట్టుకు శిక్షణాపరమైన సహకారం అందించిన నిపుణులు ఈ పోటీలను వీక్షించేందుకు రానుండటంతో మరింత ప్రాధాన్యం నెలకొంది. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లను ఎంపిక చేసి, వీరితో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

40 బస్సులు సిద్ధం : జిల్లా స్థాయిలో విజయం సాధించిన జట్లు ఇప్పటికే విశాఖ చేరుకున్నాయి. ప్రతీ జిల్లా నుంచి 134 మంది చొప్పున మెన్, వుమెన్ పోటీలకు హాజరవుతున్నారు. రైళ్లలో కొందరు, బస్సుల్లో మరికొందరు విశాఖలో ఏర్పాటు చేసిన బస ప్రాంతానికి చేరుకున్నారు. రైళ్లలో వచ్చిన వారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సుల్లో బస వద్దకు చేర్చారు. ఐదు రోజుల పాటు క్రీడాకారులను బస ప్రాంతం నుంచి మైదానాల వద్దకు తరలించేందుకు 40 బస్సులను సిద్ధం చేశారు.

జేసీపీ పర్యవేక్షణలో భద్రత : మెన్ జట్లకు దబ్బంద, వుమెన్ జట్లకు సుద్దగెడ్డ, కొమ్మాదిలోని టిడ్కో గృహాల్లో వసతి సౌకర్యం కల్పించారు. మహిళలకు ఏర్పాటు చేసిన బస వద్ద జాయింట్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో భద్రత ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం ప్రారంభ వేడుక జరగనుండగా.. మధ్యాహ్నం నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం వసతి కల్పించిన చోటే అందిస్తారు. మధ్యాహ్న భోజనం క్రీడా ప్రాంగణాల వద్ద అందజేయనున్నారు. పోటీలు జరిగే సమయంలో క్రీడాకారులకు స్నాక్స్, ఎనర్జీ డ్రింక్స్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. వసతి ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు కల్పించారు. మొబైల్ టాయిలెట్లు సిద్ధం చేశారు.

పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు ఇవే..

జిల్లా స్థాయిలో మెన్ విభాగం క్రికెట్ పోటీల్లో నక్కవానిపాలెం, బ్యాడ్మింటన్‌లో సుసర్ల కాలనీ–1 జట్టు, వాలీబాల్‌లో ప్రశాంతినగర్, కబడ్డీలో ఓల్డ్ అయ్యన్నపాలెం, ఖోఖోలో సాకేత్‌పురం–1 జట్లు విజేతలుగా నిలిచాయి. మహిళా విభాగం క్రికెట్‌లో వాంబే కాలనీ–6, బ్యాట్మింటన్‌లో పెదవాల్తేర్–2, వాలీబాల్‌లో రజకవీధి–1, కబడ్డీలో లాసన్స్‌బే కాలనీ, ఖోఖోలో లంకెలపాలెం జట్లు విజేతలుగా నిలిచి.. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాయి.

రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతులు ఇలా..

క్రీడ	ప్రథమ	ద్వితీయ	తృతీయ
క్రికెట్	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2లక్షలు
వాలీబాల్	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2 లక్షలు
కబడ్డీ	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2లక్షలు
ఖోఖో	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2 లక్షలు
బ్యాడ్మింటన్	రూ.2లక్షలు	రూ.లక్ష	రూ.50వేలు

మైదానాలు ఇవే..

రాష్ట్ర స్థాయిలో పోటీపడేందుకు 1,482 మంది పురుషులతో పాటు 1,482 మంది మహిళలు విశాఖ తరలివచ్చారు. పోటీలకు నగరంలోని మైదానాలను సిద్ధం చేశారు.

వుమెన్ క్రికెట్	వైఎస్సార్ జీ గ్రౌండ్
మెన్ క్రికెట్	రైల్వే స్టేడియం, ఏఎంసీ మైదానం, కొమ్మాది కె.వి.కె స్టేడియం
కబడ్డీ, ఖోఖో	ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానం
వాలీబాల్	ఏయూ సిల్వర్ జూబ్లీ మైదానం
బ్యాడ్మింటన్	జీవీఎంసీ ఇండోర్ స్టేడియం

వై.వి.సుబ్బారెడ్డికి అరకు ఎమ్మెల్యే సన్మానం



రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన వై.వి.సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడలో గురువారం ఆయనను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మర్యాదపూర్వకంగా కలిసి, ఆత్మీయంగా అభివాదం చేశారు.

కార్మికుల సమస్యలపై వినతి

సీలేరు: ఏపీ విద్యుత్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఏపీ జెన్‌కో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని సీఐటీయూ సీలేరు బ్రాంచ్ ప్రెసిడెంట్ బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు పదోన్నతి కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ ఎస్ఈ ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. లక్ష్మణరావు, విష్ణు తదతరులు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్యం

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

రంపచోడవరం: ఆస్పత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని గురువారం ఆయన పీవోలు సూరజ్‌గనోరే, కావూరి చైతన్యలతో కలిసి సందర్శించారు. వైద్యులతో కలెక్టర్ సమావేశమయ్యారు. అందుతున్న వైద్య సేవలు, రోగుల వివరాలను తెలుసుకున్నారు. మందులు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలని సూచించారు. జ్వరాలతో వచ్చిన వారికి రక్తపరీక్షలు చేసి మందులు అందజేయాలన్నారు. రికార్డులు పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ప్రసూతి , శిశు ఆరోగ్య విభాగం భవనాన్ని పరిశీలించారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్పత్రికి సంబంధించి ఎటువంటి అవసరాలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను వివరించారు. ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, ఎంపీడీవో హరికృష్ణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

జాకీలు విరిగిపోతున్నాయి...

- టీడీపీ జనసేనపై మంత్రి ఆర్‌కే రోజా కామెంట్లు
- మోసం చేసైనా అధికారంలోకి రావాలన్న తాపత్రయం బాబుది
- మోదీ, అమిత్ షా కాళ్లు పట్టుకునేందుకు బాబు ఢిల్లీ వెళ్లారు



విమానాశ్రయంలో మంత్రి రోజాకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు చంద్రబాబు నాయుడ్ని, లోకేష్‌ని జాకీలు పట్టుకుని లేపాలని చూస్తున్నా.. అవి విరిగిపోతున్నాయి కానీ ఉపయోగం లేకుండా పోతున్నాయని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. విశాఖలో శుక్రవారం నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన కలిసి వచ్చినా.. విడివిడిగా వచ్చినా తమకు ఇబ్బంది లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఫలానా మంచి చేశానని చెప్పుకోవడానికి ఏమీ లేదన్నారు. అందుకే వారు ఏసీ రూమ్‌ల్లో ప్రెస్‌మీట్లకే పరిమితమయ్యారన్నారు. చంద్రబాబు నాయుడు ఊసరవెల్లిలాగా ఎలా రంగులు మారుస్తునాడో ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. అధికార కాంక్షతో ఒకసారి కాంగ్రెస్‌తో, మరోసారి బీజేపీతో సిగ్గు లేకుండా పొత్తుపెట్టుకొని ఎంత దిగజారిపోతున్నాడో అందరూ గమనిస్తున్నారు. తిరుపతికి వచ్చినప్పుడు అమిత్‌షా కారుపైన రాళ్లు, చెప్పులు ఏ విధంగా వేయించాడో అందరూ గుర్తు పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా నేను తప్పు చేశాను ఇకనైనా నాకు అవకాశమివ్వండి ఇది చేస్తా, అది చేస్తానని ఒక భరోసా కల్పించే ఆలోచన ఆయనకు లేదన్నారు. ఎంతసేపు జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడం, ఆయన మీద విషం చిమ్మటం లేదా సోనియా గాంధీ, అమిత్‌షా, మోదీ కాళ్లు పట్టుకోవడం చేస్తున్నాడని విమర్శించారు. ఇలాంటి మనిషి తమ చిత్తూరు జిల్లాలో పుట్టినందుకు ప్రజలంతా సిగ్గు పడుతున్నారన్నారు. తాను నగరి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఆమెతో ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి విశాఖ చేరుకున్నారు. పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు

ఎన్నికల నిర్వహణపై పూర్తిస్థాయి అవగాహన

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రంపచోడవరం: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లపై పూర్తిస్థాయిలో అవగాహన పొంది ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించిన జిల్లా, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు ఎన్నికల సరళిపై 66 పేజీలతో ఒక హ్యాండ్ బుక్ రూపొందించినట్టు తెలిపారు. ఎన్నికలు జరిగే రోజు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన అధికారులు ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్‌ను పరిశీలించి ఎన్నికల నిర్వహించాలని సూచించారు.ఆరు పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ అధికారిని నియమిస్తున్నట్టు చెప్పారు. జెడ్ ప్లస్ కేటగిరి అభ్యర్థులకు ఒకరిని మాత్రమే పోలింగ్ బూత్‌లోకి అనుమతించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో నియమించిన మైక్రో అబ్జర్వర్లకు కూడా శిక్షణ ఇస్తామన్నారు. ఒక్కొక్క అభ్యర్థికి సంబంధించిన ఒక పార్టీ ఏజెంట్‌కు మాత్రమే పోలింగ్ బూత్‌ల్లో అనుమతి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఫోన్లు అనుమతి లేదన్నారు. ఎన్నికల బరిలోని అభ్యర్థులు ప్రతిరోజు ఎంత ఖర్చు పెడుతున్నారో నమోదు చేసేలా ఎక్కడికక్కడ అధికారులను నియమిస్తామన్నారు. పీవో సూరజ్ గనోరే,చైతన్య, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు వీవీ రమణ, చెల్లయ్య, సువర్ణ, ఫణి, పీఎస్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు

జాయింట్ కలెక్టర్ భావన



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భావన

చింతపల్లి రూరల్: పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ భావన సూచించారు. మండల కేంద్రంలో గురువారం బూత్ లెవల్ అధికారులు,సెక్టార్ అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించి అవసరమైన చోట తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆమె ఆదేశించారు. తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణ, డీటీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి పక్కా రహదారి లక్ష్యం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



అలడముల రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: ప్రతీ గ్రామానికి పక్కా రహదారితోపాటు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. మండలంలో కిందుగూడ–సిర్లిమెట్ట రోడ్డుకు రూ.3.20 కోట్లు, తుడుమురాయి – సరియపల్లి రోడ్డుకు రూ.80 లక్షలు, గాదెలబురుగు– అలడముల రోడ్డుకు రూ.1.20 కోట్లతో చేపట్టనున్న నిర్మాణాలకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మారుమూల గిరిజనులు రవాణా కష్టాలు ఎదుర్కొన్నారని, జగనన్న పాలనలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎంపీపీ సీతమ్మ, వైస్ఎంపీపీ భాగ్యవతి, సర్పంచులు నర్సింరావు, ముక్తమ్మ, రాజులమ్మ, ఎంపీటీసీలు బంగారమ్మ, సుబ్బలక్ష్మి, కమల, వైఎస్సార్‌సీపీ జేఏసీ జిల్లా కన్వీనర్ జగబంధు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు వివాదాస్పదం

పనులు నిలిపివేసిన పోలీసులు



విగ్రహానికి ఏర్పాటు చేసిన ముసుగు

ఎటపాక: మండలంలోని పురుషోత్తపట్టణం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు వివాదాస్పదమైంది. గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారంటూ పంచాయతీ అధికారులు విగ్రహానికి నోటీసులు అంటించారు. అయితే తన ఇంటి ఎదురుగా విగ్రహం ఏర్పాటు సరైంది కాదని పనులు నిలిపివేయాని కోరుతూ వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి దామెర్ల రేవతి కూడా పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు విగ్రహం ఆవిష్కరణ పనులు నిలిపివేయాలని తెలిపి విగ్రహానికి ముసుగు వేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించాలని పంచాయతీ అధికారులు నోటీసులో పేర్కొన్నారు.

భిన్న వాతావరణం

ఉదయం పొగమంచు.. మధ్యాహ్నం భానుడి ప్రతాపం



పాడేరు అంబేద్కర్ సెంటర్‌లో ఉదయం కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: మన్యంలో గురువారం భిన్నమైన వాతావరణం నెలకొంది. ఉదయం పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం 9గంటల వరకు మంచుతెరలు వీడలేదు. సూర్యోదయం అయిన తరువాత ఉదయం 11గంటల నుంచి ఎండ తీవ్రత నెలకొంది. మధ్యాహ్నం 2గంటల వరకు భానుడు ప్రతాపం చూపాడు. ఎండతీవ్రతకు పాడేరు మండలం గుత్తులపుట్టు,జి.మాడుగుల మండలం మద్దిగరువు వారపుసంతల్లో గిరిజనులు,వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రం పాడేరుతో పాటు ప్రధాన రోడ్లలో మధ్యాహ్నం జనసంచారం తగ్గింది.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 15 డిగ్రీలు,అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 15.1 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం ఐదుగంటల నుంచి చల్లని వాతావరణం నెలకొంది.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం



మంపలో మహిళలతో మాట్లాడుతున్న జీసీసీ ఎండీ సురేష్, అధికారులు



రాజవొమ్మంగిలో జీసీసీ ఎండీ సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

- కొయ్యూరులో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు
- నెల రోజుల్లో ప్రాసెసింగ్ యంత్రాలు
- 600 టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యం
- జీసీసీ ఎండీ సురేష్‌కుమార్

కొయ్యూరు: మహిళల ఆర్థికాభివృద్ధికి జీసీసీ ప్రాధాన్యమిస్తోందని జీసీసీ ఎండీ సురేష్ అన్నారు. మండలంలోని శరభన్నపాలెం, డొనూరు, అంతాడ, మంప, గంగవరం గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని వన్‌ధన్ విద్యా వికాస్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వీడీవీకే సభ్యులతో మాట్లాడుతూ కొయ్యూరు మండలంలోని జీడి తోటల విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని ఐదు, ఆరు చోట్ల జీడీపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు యోచిస్తున్నామన్నారు. ఆయా యూనిట్ల ద్వారా మహిళలు ఉపాధి పొందేందుకు సుమారు ఆరు నుంచి ఏడు లక్షల రూపాయల వ్యయంతో ప్రాసెసింగ్ యంత్రాలు అందజేసి, మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. రైతులకు మేలు చేసేందుకు వీలుగా జీడిపండ్ల ప్రాసెసింగ్ యూనిట్‌ను కొయ్యూరులో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. మంప గ్రామంలోని అల్లూరి సీతారామరాజు పార్కును సందర్శించారు. ఈ ఏడాది 600 టన్నుల వరకు కాఫీ పండ్ల కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్టు జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ చెప్పారు. ఇప్పటివరకు 300 టన్నులు కొనుగోలు చేసినట్టు తెలిపారు. జీసీసీ ద్వారా ఈ ఏడాది వేసవిలో నన్నారితో పాటు కొన్ని రకాల డ్రింక్‌లను ఉత్పత్తులు చేస్తామన్నారు. కొయ్యూరు జీసీసీ బీఎం భవనాన్ని రూ. 9.7 లక్షలతో మరమ్మతులు చేపతామన్నారు. జీసీసీ గోడౌన్‌ను కొయ్యూరు తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఆయనతో పాటు సీనియర్ మేనేజర్ శేఖర్, డీఎం దేవరాజ్, బీఎం విజయ్‌కుమార్ తదితరులున్నారు.

రాజవొమ్మంగి ఆదివాసీలు కష్టపడి పండించిన పంటను ధనంగా మలచుకోడానికే వీడీవీకేలు (వన్‌ధన్ వికాస కేంద్రాలు) ఏర్పాటు చేసినట్టు జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ (విశాఖపట్నం) అన్నారు. ఇప్పటికే పాడేరు డివిజన్‌లో–9, రంపచోడవరం డివిజన్‌లో–110 ఏర్పాటు చేశామన్నారు. ఈ సంఘాల్లో గిరిజనులతో పాటు గిరిజనేతర రైతులు కూడా భాగస్వామ్యం కావచ్చన్నారు. ఆయన గురువారం మండలంలోని శరభవరం రామాలయం వద్ద, స్థానిక జీసీసీ సూపర్ బజార్ వద్ద స్థానిక వీడీవీకే (వన్ ధన్ వికాశ కేంద్రం సభ్యులతో) సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వీడీవీకేల ప్రాధాన్యతను వివరించారు. పండించిన పంటను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చుకొనేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జీడిమామిడి పిక్కలను నేరుగా మార్కెట్లులో విక్రయించకోకుండా ఇంటివద్దనే ప్రాసెసింగ్ చేసి, ప్యాకెట్స్‌గా మార్కెట్‌లో విక్రయిస్తే రెట్టింపు ఆదాయం పొందవచ్చన్నారు. ఇందుకు అవసరమైన శిక్షణ, యంత్ర సామగ్రి ఐటీడీఏ పీఓ ద్వారా వీటీడీఏలకు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది ప్రతి వీడీవీకేకు ఒక జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ఇవ్వాలని ప్రణాళిక రూపొందించామన్నారు. ఒక్కో వీడీవీకేకు రూ.15 లక్షల నిధులు సమకూరుస్తామని, ఈ నిధులతో అవసరమైన యంత్రాల కొనుగోలు, ప్యాకింగ్ సామగ్రి కొనుగోలు చేసి అందజేస్తామన్నారు. వీడీవీకేల్లో చింతపండు, పసుపు, కొండ చీపుళ్లు, అడ్డాకుల తయారీ యూనిట్లు కూడా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక జీసీసీ అధికారులు, సిబ్బంది ఎండీ సురేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. జీసీసీ మేనేజర్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. సేల్స్‌ఉమన్లు సత్యవతి, లక్ష్మి, వెలుగు వీఓఏ రామరాజు తదితరులున్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన

వై.రామవరం: మండలంలోని పలు గ్రామాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు శుక్రవారం పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చవిటిదిబ్బలులో మధ్యాహ్నం 2గంటలకు వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం, బండిగడ్డ గ్రామంలో బీటీ రోడ్డు ప్రారంభోత్సవం, వై.రామవరంలో 5గంటలుకు సీహెచ్‌సీ భవనాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారధులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ, జెడ్పీటీసీలు కోరారు.

ఉపాధి పనుల కల్పనకు వినతి

గూడెంకొత్తవీధి: ఉపాధి హామీ పథకంలో తమకు పనులు కల్పించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల గిరిజనులు గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు మాట్లాడుతూ అధికారులు స్పందించి జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. బాలయ్య, చంటిబాబు, పరమేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రత్నకుమార్ బాధ్యతల స్వీకరణ


తహసీల్దారు రత్నకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: మండల తహసీల్దార్‌గా రత్నకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా తెర్లాం మండలంలో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన ప్రసాద్ శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రత్నకుమార్‌కు స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ముమ్మరంగా తనిఖీలు


కింద్ర జంక్షన్ వద్ద వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సన్యాసినాయుడు

రాజవొమ్మంగి: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు ప్రాంతాల్లో సీఐ ఎస్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆటో డ్రైవర్లు, వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. వాహన రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అతి వేగం వద్దని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని చెప్పారు. ఎస్ఐ వెంకయ్య, సిబ్బంది ఉన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని కితలంగి పంచాయతీ వయ్యా, పరిశీల, కితలంగి గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్‌లు వేయించుకోవాలని సూచించారు. పశువ్యాధులపై అవగాహన కల్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.



అక్కచెల్లెమ్మలకు ఆర్థిక ఆసరా

నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా సొమ్ము జమ

ఆర్థికంగా ఎదుగుతున్న డ్వాక్రా మహిళలు

నాలుగు విడతల్లో రూ.10.46కోట్లు జమ


సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు (ఫైల్)


చెక్కుల పంపిణీ కార్యక్రమంలోని పాల్గొన్న డ్వాక్రా సంఘ మహిళలు (ఫైల్)

అనంతగిరి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి భరోసా కల్పించేందుకు అనేక పథకాలను అమల్లోకి తీసుకొచ్చారు. మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కుటుంబపోషణలో ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రణాళిక చేపట్టారు. ఇందులో భాగంగా అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎసార్ ఆసరా **పథకాన్ని విజయవంతంగా అమ**లుచేస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తామని చంద్రబాబు ప్రకటించి తీరని మోసం చేశారు. డ్వాక్రా సంఘాల గురించి కనీసం **పట్టించుకోలేదు.** దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదంతా గతం... జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో వచ్చాక డ్వాక్రా సంఘాల **అభ్యున్నతి కోస**ం పథకాలను అమల్లోకి తీసుకొ**చ్చారు. సంక్షేమ** పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ వారి కుటుంబాలకు మహిళలే అండగా నిలిచేలా భరోసానిచ్చారు.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నేరవేర్చాలనే ధృడసంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నడుం బిగించి, మహిళలను మహారాణులను చేశారు. సున్నావడ్డీ రుణాలు, ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలతో మహిళ సాధికారతకు ప్రాధాన్యమిచ్చారు. అక్కచెల్లెమ్మలు సొంతంగా వ్యాపారులు సాగించి, ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కల్పించారు. సమాజంలో మహిళలు తల ఎత్తుకునేలా భరోసా కల్పించారు. దీంతో అక్కచెల్లెమ్మలు జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

అనంతగిరి మండలం వైఎస్సార్ ఆసరా వివరాలు

విడత	గ్రూపులు	సభ్యులు	జమ అయిన సొమ్ము
మొదటి విడత	503	5533	రూ.2.57కోట్లు
రెండో విడత	507	5533	రూ.2.65కోట్లు
మూడో విడత	506	5563	రూ.2.58కోట్లు
నాలుగో విడత	511	5610	రూ.2.66కోట్లు

మండలం	:	అనంతగిరి
పంచాయతీలు	:	24
గ్రామాలు	:	418
జనాభా	:	50,000
గ్రామ సచివాలయాలు	:	21
డ్వాక్రా సంఘాల గ్రూపులు	:	511
సభ్యులు	:	5610
వైఎస్సార్ ఆసరా ద్వారా జమ అయిన మొత్తం		రూ. 10.46కోట్లు

జగనన్నకు రుణపడి ఉంటాం



ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం జగనన్న మాకు అవకాశం కల్పించారు. చేయూత పథకం ద్వారా సొమ్ము జమ అయింది. కిరణా షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. జగనన్నకు రుణపడి ఉంటాం.

– జయలక్ష్మి, డముకు గ్రామం

జగనన్న మేలు చేశారు



మా కుటుంబాలకు అండగా నిలిచేలా జగనన్న మాకు మేలు చేశారు. నాలుగు విడతల్లో రూ.30వేల ఆసరా సొమ్ము అందుకున్నాను. ఇంటివద్ద పాన్‌షాపు పెట్టుకుని, నా కుటుంబం నేను బతుకుతున్నాం.

– గెమ్మెల చంద్రకళ, అనంతగిరి

ఆర్థిక ఎదుగుదలకు అవకాశం

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇదోక మంచి అవకాశం. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ ఆసరా, వడ్డీలేని రుణాలు, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు మహిళలు అభ్యున్నతికి ఎంతోగానో ఉపయోగపడుతున్నాయి.

– శ్రీరాములు, ఇన్‌చార్జి ఏపీఎం, అనంతగిరి

మహిళా సాధికారతకు ప్రాధాన్యం



మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారత కోసం సీఎం జగనన్న అనేక పథకాలు అమలు చేస్తున్నారు. పురుషులతో సమానం మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. అక్కచెల్లెమ్మలకు ప్రభుత్వం చేదోడుగా నిలుస్తుంది.

– చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

అరకు సమన్వయకర్త రేగం మత్స్యలింగం


మాట్లాడుతున్న రేగం మత్స్యలింగం, నేతలు

డుంబ్రిగుడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు అందరు సమిష్టిగా సైనికుల్లా పని చేయాలని అరకు నియోజకవర్గ సమన్వకర్త రేగం మత్స్యలింగం అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడితే తగిన గుర్తింపు వస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసేలా పార్టీ శ్రేణులంతా పనిచేయాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కూడా పాపారావు, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, సర్పంచ్‌లు శారద, వెంకటరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు జగ్గునాయుడు, నాయకులు విజయ, రామారావు, గణపతి, శెట్టి గోపాల్, లీలారాణి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి అన్నారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో తాగునీటి పథకాలు, బోర్లు వంటివి ఏర్పాటు చేస్తున్నట్టు చెపాపరు.

ఇప్పటికే మండలంలో 14 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు రూ.20 లక్షలతో 17 బోర్లు ఏర్పాటు చేస్తున్నమన్నారు. రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


క్విజ్ టీమ్‌కు ప్రథమ బహుమతి అందజేస్తున్న ఎంఈవో రాజులు తదితరులు

ఎటపాక: మండల స్థాయిలో జిల్లా పరిషత్ పాఠశాలలకు హోలీ స్పిరిట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ పోటీలు గురువారం ముగిశాయి. గౌరీదేవిపేట హైస్కూల్‌లో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీల్లో ఏడు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు ఎంఈవో సరియం రాజులు, వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు, మాజీ సొసైటీ చైర్మన్ వెంకట రామారావు, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్, దారా రవి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని హితవుపలికారు. పాఠశాలకు చెందిన వసంతాల రవి, దారా రామకృష్ణల జ్ఞాపకార్థం 1993–94 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు కూడా వ్యాసరచన, పాటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. నల్లా హర్ష తన తండ్రి వెంకన్న జ్ఞాపకార్థం పాఠశాలకు సైకిల్ షెడ్ నిర్మించేందుకు ముందుకువచ్చారు. వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి కె.లాస్యంత్(నెల్లిపాక), ద్వితీయ బహుమతి కె.జంపన్న (ఏహెచ్‌ఎస్, నల్లకుంట), తృతీయ బహుమతి (వై.సహస్ర, సీతాపురం), డిబేట్‌లో ప్రథమ బహుమతి ఎం.రేవతి(నెల్లిపాక), ద్వితీయ బహుమతి (ఎ.ప్రణవి, సీతాపురం), తృతీయ బహుమతి వినీల (గౌరిదేవి పేట), క్విజ్‌లో ప్రథమ బహుమతి జెడ్పీహెచ్‌ఎస్ నెల్లిపాక టీం, ద్వితీయ జడ్పీహెచ్‌ఎస్ (గౌరిదేవిపేట టీం), పాటలు పోటీల్లో ప్రథమ బహుమతి ఎస్.విష్ణు (ఏహెచ్‌ఎస్ నల్లకుంట), ద్వితీయ ఏసుబాబు(ఏహెచ్‌ఎస్ నల్లకుంట), తృతీయ వినీల(గౌరిదేవిపేట)తో పాటు పలువురు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. సీఐ రామారావు, ఎస్ఐ పార్థసారధి, హెచ్ఎం శ్రీశైలం, యూత్ సభ్యులు శ్రీనివాసరావు, సుధాకర్, ప్రసాద్, శివ, టి.రమేష్, ఎం.రమేష్, వెంకటేష్, ప్రశాంత్, మదార్ తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీకే గిరిజనుల మద్దతు


కొత్తపాకల గ్రామంలో జై జగన్ అంటూ పిలుపునిస్తున్న గ్రామస్తులతో, జెడ్పీటీసీ బాలయ్య

చింతపల్లిరూరల్: మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ కొత్తపాకలు గ్రామాన్ని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య గురువారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన నాయకులు గిరిజనులు తమ పార్టీలో చేరుతున్నట్టు చేస్తున్న తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం సీఎం జగనన్న ప్రవేశపెట్టిన అనేక పథకాల వల్ల లబ్ధిపొందిన గిరిజనులు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ ఉంటారని స్పష్టం చేశారు. గిరిజనులు వైఎస్సార్‌సీపీ తప్ప ఏ పార్టీని నమ్మే ప్రసక్తే లేదన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తామంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటామని, జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా గెలిపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. జై జగన్ అంటూ జేజేలు పలికారు. సచివాలయ కన్వీనర్ శ్రీరాములు, నాయకులు జోషఫ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు పంపిణీ


విద్యార్థులకు పలకలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ భాగ్యవతి

ముంచంగిపుట్టు: మండలంలోని బూసిపుట్టు పంచాయతీ మద్దులబంద, పూలబంద, సంతవీధి గ్రామాల్లో పేద విద్యార్థులకు సర్పంచ్ భాగ్యవతి తన సొంత నిధులు వెచ్చించి పలకలు, పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. హెచ్ఎం జలంధర్, ఉపాధ్యాయులు స్వప్న, కృష్ణ, నాయకులు సురేష్, పూర్ణారావు, ఆనందరావు, విద్యా కమిటీ చైర్మన్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు తప్పనిసరి


రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు


కూనవరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో ప్రేమ్‌సాగర్

రంపచోడవరం: నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు ఇవ్వనున్నట్టు ఏడీఎంహెచ్‌వో డాక్టర్ జి.ప్రకాశం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది వయస్సు నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి ఆయా మాత్రలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో 64,000 మాత్రలు పీహెచ్‌సీలకు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఆరోగ్యకార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా మధ్యాహ్నం భోజనం తరువాత పిల్లలకు ఆయా మాత్రలను ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చూసేందుకు అందరూ భాగస్వామ్యులు కావాలన్నారు.

రాజవొమ్మంగి: మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీలు, విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారులు, సిబ్బందితో ఎంపీడీవో యాదగిరీశ్వరరావు గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 19 సంవత్సరాలు లోపు ఉన్న వారందరికీ డీ వార్మింగ్ మాత్రలు మింగించాలని సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం సరఫరా చేసిన అల్బెండజోల్ మాత్రల బాక్సులను ఆయా శాఖలకు అందజేశారు. వైద్యాధికారులు నాగార్జున, ఉషశ్రీ, యామినిప్రియ, సీడీపీవో దేవమణి, ఎంఈవో సూరయ్యరెడ్డి పాల్గొన్నారు.

కూనవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో ఎంపీడీవో ఈ.ప్రేమ్‌సాగర్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది వయస్సు ఉన్నవారి నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణా మాత్రలు మింగించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా నులిపురుగుల నివారణ వివరాలున్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. హెల్త్ సూపర్‌వైజర్లు డి.శ్రీనివాసరావు, సీత, ఫీల్డ్ స్టాఫ్ వెంకటేశ్వర్లు, రత్నం, భద్రావతి, హేమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన


శివలింగపురం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నరసింహమూర్తి


పోలిపాకలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలిస్తున్న తహసీల్దార్ మురళీకృష్ణ

అనంతగిరి: మండలంలోని సుకూడుపుట్టు, పైనంపాడు, వేంగడ, వాలసీ, పెదబిడ్డ, గుమ్మ, మేడపర్తి, శివలింగపురం పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సూరు నరసింహమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్, ఎన్నికల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలిస్తున్నామన్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆర్ఐ శంకరరావు, సిబ్బంది ఉన్నారు.

కూనవరం: మండలంలోని పోలిపాక, పోచవరం, కాలనీ, కాచవరం, టేకుబాక, నర్సింగపేట ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ గురువారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని, ఓటర్లను నమోదు చేసుకోవాలని, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావలని తెలిపారు. సిబ్బంది సత్యనారాయణ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

రాజవొమ్మంగి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు అధికారులు, సిబ్బంది సహకరించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని తహసీల్దార్ డి.వి.సత్యనారాయణ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన గురువారం సెక్టోరియల్ ఆఫీసర్లు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలపై క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్ల జాబితాలో మృతుల వివరాలు ఉంటే తొలగించాలని సూచించారు. కొత్త ఓటర్లను చేర్పించాలన్నారు. ఎంపీడీదవో యాదగిరీశ్వరరావు, డీటీ సత్యనారాయణ, ఎంఈవో సూరయ్యరెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు


మాట్లాడుతున్న ఏపీడీ గిరిబాబు

ముంచంగిపుట్టు: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీకి ఉపాధి పనులు కల్పిస్తున్నట్టు ఎన్ఆర్ఈజీఎస్ పాడేరు ఏపీడీ గిరిబాబు అన్నారు. మండలంలోని బాబుశాలలో ఉపాధి కూలీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఉపాధి సిబ్బంది తీరుపై ఆరా తీశారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని, గతంలో చేసిన పనులకు సైతం కూలీ జమ అవుతందన్నారు. ఏపీవో సంగంనాయుడు, వీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

బోడిదొరకు రక్తహీనత

పరీక్షించిన వైద్యులు


బోడిదొరకు పండ్లు అందిస్తున్న వరలక్ష్మి

కొయ్యూరు: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మల్లుదొర మనువడు బోడిదొర రక్తహీనతతో బాధపడుతున్నట్టు గురువారం వైద్యులు నిర్ధారించారు. డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశాల మేరకు వైద్యాధికారులు శాంతి, ధనుష్, కొయ్యూరు వైద్యులు మనోజ్ఞ బోడిదొరను రక్త పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం అందించేందుకు అతనిని కేజీహెచ్‌కు తరలించాలని నిర్ణయించినట్టు వారు పేర్కొన్నారు. ఇలావుండగా బోడిదొరను జాతీయ అల్లూరి యువజన సంఘం నాయకురాలు శ్యామల వరలక్ష్మి పరామర్శించి పండ్లు అందజేశారు. కుటుంబ సభ్యుల వినతి మేరకు గురువారం సాయంత్రం అతనిని స్వగ్రామం లంకవీధికి తరలించారు. అక్కడ నుంచి శుక్రవారం కేజీహెచ్‌కు తీసుకువెళ్లనున్నారు.

నేటి నుంచి చింతూరులో రేల పండగ


రేలపండుగలో ఒడిశా కళాకారుల నృత్యం(ఫైల్)

చింతూరు: ఐదవ జాతీయ స్థాయి ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా ఈనెల 9 నుంచి 11 వరక చింతూరులో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రేల పండుగ నిర్వహించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు గిరిజన సంప్రదాయ నృత్యాలతో అలరించనున్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణపై ఆదివాసీ నాయకులు ప్రసంగించనున్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా రేలపండుగ నిర్వహిస్తున్నట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ప్రతినిధులు వెంకటరమణ, మురళి తెలిపారు. ఆదివాసీల జీవనశైలి, జీవనవిధానం, సంస్కృతి, సంప్రదాయాల ఆధారంగా వేదాలు, గ్రంథాలు, పురాణాలు వెలిశాయన్నారు. రేలపండుగను విజయవంతం చేయాలని వారు కోరారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ పాశ్చాత్య సంస్కృతికి గురికాకుండా సాంస్కృతిక పునరజ్జీవం కోసం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నామని వారు పేర్కొన్నారు.

10న వైఎస్సార్‌సీపీ రోడ్‌షో

రంపచోడవరం: దేవీపట్నం మండలంలో శనివారం వైఎస్సార్‌సీపీ రోడ్ షో (వాహనయాత్ర)నిర్వహిస్తున్నట్టు పార్టీ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొంటున్నారని, ఫజుల్లాబాద్‌లో ఉదయం 10.30గంటలకు వాహనయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండలంలోని ఇందుకూరు, పోతవరం, శరభవరం వరకు రోడ్ షో జరుగుతుందని, అనంతరం సాయంత్రం 5 గంటలకు ఇందుకూరుపేటలో వాహన యాత్ర జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు , పార్టీ అభిమానులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.